


## (ప్రారంభం)

### 5

**మర్నాడుదయం ‘తొలిసంధ్య‘ పత్రికాఫీసుకి వెళ్ళాడు రామారావు.** "సార్! అయ్యగారు బైటికి వెళ్ళారు. ఐదునిముషాల్లో వస్తానన్నారు. ఈలోగా మీరొస్తే కూర్చోమనీ, ఈ కాగితాలు చూస్తుండమనీ చెప్పారు" అంటూ ప్యూను కాగితాలిచ్చి కుర్చీ చూపాడు.

కూర్చుని కాగితాలు ముందరేసుకున్నాడు. చంద్రశేఖర్ వచ్చి విష్ చేశాక తెలిసింది తనొచ్చి నాలుగు గంటలయిందని. వచ్చేవారం అనుబంధ పత్రిక కొరకు వేయవల్సిన వ్యాసాలు, కథలు, కార్టూన్లు వగైరాలన్నీ ఆ కాగితాల్లో ఉన్నాయి.

"రామారావ్ నా ఆలస్యానికి సారి. నీ ఇంటర్వ్యూ ఆ గదిలో జరుగుతుంది వెళ్ళు" చంద్రశేఖర్ అన్నాడు. తలుపులు తోసుకుని లోపలికి వెళ్ళిన రామారావ్ ఒకింత ఆశ్చర్యపడినా "నమస్తే సర్" అన్నాడు మామూలుగా.

"మిస్టర్ రామారావ్! మిమ్మల్ని ఎక్కువ ప్రశ్నలడిగి విసిగించను. ‘వార్త‘ అంటే ఏంటో పది వాక్యాలకి మించకుండా క్లుప్తంగా, గుప్తంగా వ్రాయి" అన్నాడాయన. జేబులో నుండి పెన్ తీసి ఆయన అందించిన కాగితం మీద గబగబ వ్రాశాడు. వ్రాసి ఆయన చేతికిచ్చాడు. అదందుకుని చదివి ఆయన బెల్ నొక్కాడు. రామారావు బయటికి నడిచాడు.

"యస్సర్" అంటూ వచ్చాడు చంద్రశేఖర్. "రేయ్ చంద్రం నీ పత్రికలో పనిచేయడానికి బంగారం లాంటి కుర్రాడిని ఎన్నుకున్నావు. కానీ ఇతను బంగారం కాదు. ‘ఒక్క నిమిషం ఆగి తిరిగి అన్నాడు "ఏ..మన్నావు?"

"ఇతను బంగారం కాదు"

"నిజం.. బంగారం కాదు. వజ్రం"

"మూర్తీ థాంక్యూరా" పెద్దగా నవ్వుతూ చెయ్యి అందించాడు. మూర్తి అనబడే ఆ వ్యక్తి కూడా నవ్వి "నేనిక..వస్తారా" అన్నాడు కుర్చీలో నుండి లేస్తూ.

"ఒకే పద ఇంటిదగ్గర, లేదా ఆఫీసు దగ్గర దింపుతాను."

"వద్దు. నే వెళ్ళవలసింది ఆఫీసుకే. ఆర్టీసీ బస్సులో వెళితేనే ఆఫీస్‌కి వెళ్ళిన అనుభూతి కలుగుతుంది. వస్తా" అంటూ బైటికి నడిచాడు.

"సరే పద క్రిందదాకా వస్తాను" చంద్రశేఖర్ వెంబడించాడు. కొన్ని మెట్లు దిగాక ఆగి "రేయ్ చంద్రం ఐదారేళ్ళ క్రితం నాకు గుండెపోటు వచ్చి బస్సులో పడిపోతే ఓ బాలుడు నన్ను హాస్పిటల్లో చేర్చాడు. ఆ తరువాత బైపాస్ సర్జరీ కూడా అయింది గుర్తుందా?"

"ఆఁ ఉంది ఉంది"

"ఆ బాలుడే ఈ యువకుడు. ఇక ఉండు నే వస్తాను" మూర్తి గబగబ అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. చంద్రశేఖర్ రామారావ్‌ని చేరి "రామారావ్ నువ్వు నీ కిష్టం వచ్చిన రోజునుండి డ్యూటీలో జాయినవ్వచ్చు" అన్నాడు.

"మీకు అభ్యంతరం లేకుంటే ఈ రోజే జాయినవుతాను" రామారావన్నాడు.

"సరే" అంటూ మేనేజర్ని పిలిచి "నే చెప్పిన రామారావు ఇతనే. ఇతనిక్కేటాయించిన గది చూపించి ఫైల్సవీ ఇవ్వండి. చాలు ఏం చేయవల్సిందీ అతనిష్టానికి వదిలేయండి" చెప్పాడు చంద్రశేఖర్ .

"సరే సర్" అంటూ రామారావుని వెంటతీసుకు వెళ్ళాడతను.

'మూర్తి వేసిన ప్రశ్నలేంటి? రామారావిచ్చిన జవాబులు ఏంటి?' మనస్సు చేస్తున్న ఆరాటాన్ని తట్టుకోలేక ఇందాకటి గదిలోకి వెళ్ళి కాగితం తీసి చదివాడు. మూర్తి వ్రాసిన ప్రశ్న కనిపించింది.

"వార్తని పది వాక్యాల్లో వ్యాఖ్యానించు". దానిక్రింద రామారావు వ్రాసిన జవాబు. తెల్లనికాగితంపై నీలాలు కురిసినట్టు అందమైన అక్షరాలు.

'మనిషిని కుక్కకరిస్తే అది నిన్నటి పాతవార్త.
మనిషి కుక్కని కరిస్తే అది రేపటి తాజావార్త.
మనిషిని మనిషి కరిస్తే అది నేటి సంచలన వార్త.
విషయాన్ని వివరంగా వ్రాస్తే అది నిన్నటి పాతవార్త,
విషయాన్ని విశ్లేషిస్తూ వ్రాస్తే అది రేపటి తాజా వార్త,
విషయాన్ని విషయంగా వ్రాస్తే అది నేటి సంచలన వార్త.
మనిషి దేవుడిలా ప్రవర్తిస్తే అది నిన్నటి పాతవార్త,
మనిషి దానవుడిలా ప్రవర్తిస్తే అది రేపటి తాజావార్త,
మనిషి మనిషిలా ప్రవర్తిస్తే అది నేటి సంచలన వార్త'

చదివిన చంద్రశేఖర్ ఓ నిమిషం కళ్ళుమూసుకుని అలా కూర్చుండిపోయాడు. 'నిజం నేను వజ్రాన్ని పొందాను' అనుకున్నాడు. అంతలో ఫోన్ "హలో" అన్నాడు.

"నేనురా మూర్తిని. నా ప్రశ్న, రామారావు జవాబు నీవీపాటికి చదివే ఉంటావు. అతను వజ్రమే. సందేహం లేదు. కానీ జాగ్రత్త. వజ్రం సంపదల్ని తెస్తుంది. ఆపదల్ని కూడా తేవచ్చు. అప్రమత్తతతో మెలుగు. ఉంటా" ఫోన్ పెట్టేశాడు మూర్తి.

●●●

'తొలిసంధ్య' ఆఫీసులో రామారావు సబ్ ఎడిటరు కాదు, ఎడిటర్ కాదు, మేనేజరూ కాదు. ప్యూను కాదు. 'ప్రత్యేక సలహాదారుడు' అంతే. తొమ్మిదక్షరాల ఈ పదవి అతనిలో పెద్దగా మార్పుని తేలేకపోయింది కాని అతనివల్ల పత్రిక స్వరూప, స్వభావాలే మారిపోయాయి.

వార్తల్లోని శైలీ, వ్యాఖ్యానాల్లోని వ్యంగ్యత, ప్రజల మనసులకి హత్తుకుంది. దిగజారిపోతున్న మానవత్వపు విలువల మీద 'రాం రాం' అంటూ అతను వ్రాసే వ్యాసాలు బహుళ ప్రజాదరణ పొందాయి. సంవత్సరానికంతా పత్రిక సర్క్యులేషన్ చంద్రశేఖర్ అంచనాల్ని మించిపోయింది.

అందుకు రామారావ్ని తన ఆఫీసు గదిలోకి పిలిపించి "రామారావ్ నీకీ రోజునుండి జీతం పెంచుతున్నాను" అన్నాడు.

"ఎవరెవరికి?"

"నీకు"

"ఇంకా"

"ఇంకా ఎవరున్నారు? నీకొక్కడికే"

"క్షమించండి. నాకా యోగ్యత లేదు. వస్తా" వెనుతిరిగాడు.

ఆయన విస్తుపోయి "ఆగు రామారావ్ నీ మనస్సులో ఏముందో చెప్పు. ప్లీజ్" అన్నాడు.

రామారావ్ వెనుదిరిగి వచ్చి "ఐతే వినండి. పత్రికని అభివృద్ధి చేసే ఆలోచన నాదైతే ఆచరణ శకుంతలగారిది. మీరు ఆమెని విడిచి నాకు జీతం పెంచడం నాకు నచ్చలేదు" అన్నాడు.

"మరిప్పుడు నన్నేం చేయమంటావ్?" కావాలనే అడిగాడు.

"మీరు నాకు పెంచదల్చుకున్న మొత్తాన్ని సగం చేసి, ఆమెకూ, నాకూ పంచడం న్యాయం"

"గుడ్ రామారావ్! ఈ సమాధానం నీ నుండి వస్తుందో, రాదో చూద్దామనే 'నన్ను ఏం చేయమంటావ్?' అనడిగాను. నే జీతం పెంచింది నీకొక్కడికే కాదు. ఆమెక్కూడా ఆమెని పిలిపించి నీకు చెప్పినట్టే చెప్పాను. విచిత్రం ఏంటో తెలుసా? మీరిద్దరూ ఒకేలా మాట్లాడి, ఒక్కలా ప్రవర్తించడం. థాంక్యూ. నీ వ్యాసాల్లో ఉన్న నిజాయితి నీలో ఉందా? లేదా? చూద్దామనుకున్నాను. చిన్న పరీక్ష పెట్టాను. పరీక్షలో నెన్నోడించి, నా విశ్వాసాన్ని గెలిపించారు మీరిద్దరూ" అన్నాడు సంతోషంగా.

●●●

"పోస్ట్" అన్న కేకవిని వాకిట్లో మొక్కలకు పాదు చేస్తున్న తాతగారు ఉత్తరాన్ని అందుకుని వ్రాసిన వారి చిరునామా చదివి "బాబోయ్" అన్నాడు ఆశ్చర్యంగా. ఉత్తరం చించి, చదివి పరుగులాంటి నడకతో గబగబ ఇంట్లో కొచ్చి "అమ్మాయ్! జయా" అంటూ పిలిచాడు.

"ఏంటి మామయ్యా?" కూర కలుపుతున్న గరిటనలాగే పట్టుకు వచ్చింది జయ.

"జయా మనమంతా ప్రశాంతంగా ఉండటం సహించలేని దేవుడు మనింటికి ఓ తుపానుని పంపించబోతున్నాడు" కంగారుగా అన్నాడు.

"తుఫాను మనింటికి రావడమేమిటి?"

"తుఫాన్ మనింటికే రాబోతుంది. ఆ తుఫాను పేరు సుబ్బాయమ్మ"

"ఎవరూ?"

"మా వదిన సుబ్బాయమ్మ. మీ ఇంటికి వస్తున్నానబ్బాయ్. అంటు వ్రాసింది"

"ఎవరూ? మీ సవత్తల్లి కోడలే?"

"సాక్షాత్తూ ఆవిడే"

"మిమ్మల్ని కట్టుబట్టల్తో బైటికి పంపించింది కదా? ఇపుడు ఏ ముఖం పెట్టుకుని మీ ఇంటికి వస్తుంది మామయ్యా?"

"నవ్వు ముఖం. అరటి పండు అడ్డంగా పట్టేట్టు మూతిని అడ్డంగా సాగదీసుకుని మరీ వస్తుంది"

"అది సరే.. ఆవిడ ఇపుడు ఎందుకొస్తున్నట్టు?"

"అదే ఉత్తరం చదివిన్నుండి ఆలోచిస్తున్నా. అర్థంగావడంలేదు"

"సరే రానివ్వండి. వచ్చే విపత్తుని రాకుండా ఆపడం ఎవరి తరం?"

వాళ్ళు భయపడుతున్న విపత్తు మర్నాటికల్లా ఇంట్లో వాలింది. "ఎలా ఉన్నావబ్బాయ్?" అంటూ ఆప్యాయంగా పలకరించింది. "నీ కోడలి గురించి అంతా చెబితే ఏమో అనుకున్నాను. ఎంత సున్నితమైన చక్కదనం. ఇంతమంచి గుణం. ఎలాగైనా నీవు అదృష్టవంతుడివి" అంటూ మొదలెట్టింది. వంటగదిలో దూరి జయకి సాయం చేసింది.

గోగునారతో మంచం నేసిపెట్టి సూర్యం దగ్గర మార్కులు కొట్టేసింది. కమ్మని నెయ్యి తెచ్చింది. అరిశలు, మినప సున్నుండలు తెచ్చింది. ఖాళీగా ఉన్న సీసాలనిండా కమ్మని పచ్చళ్ళు, పొళ్ళు నింపింది. 'ఈ వయసులో కూడా వదిన చేతిరుచిపోలేదు' అనుకున్నారు తాతగారు. నాల్రోజులున్నాక ఐదో రోజు కమ్మని భోజనం పెట్టింది. యాలుకులు, లవంగాలు వంటి పదహారు సుగంధ ద్రవ్యాలతో తను తయారు చేసి తెచ్చిన పొడిని - చిలకల్లా చుట్టిన తమలపాకుల్లో వేసి అందరి ముందుంచింది.

'భార్య భర్తకి ఇంతకమ్మని భోజనం, ఇన్ని రకాల రుచులు అలవాటు చేస్తే ఆ మొగుడు తమ్ముడినేంటి? ప్రపంచాన్నే కాదని ఆమెతో ఉండిపోతాడు' అనుకున్నారు తాతగారు. 'అందుకే ఆనాడు తనంటే ఎంతప్రేమ ఉన్నా అన్నయ్య ఆమె మాటని దాటలేకపోయాడు'. ఆయన ఆలోచనలతో ఉండగానే బాంబు పడింది.

అదీ ఆయన గుండెల్లో. "అబ్బాయ్. నాకు ఉపోద్ఘాతాలు, నాన్చడాలు రావు. చల్లకని వచ్చి ముంతదాచడం దేనికి? నాకున్న ఒక్కగా నొక్క కూతురు రమ. దానికిద్దరు పిల్లలు. పిల్లాడు పెద్దాడు. వాడి పెళ్ళయింది. ఢిల్లీలో ఉంటున్నాడు. అమ్మాయి చిన్నది. దానిపేరు మేఘ. నీ మనవడు రామారావ్‌కి ఏ మాత్రం తీసిపోకుండా ఉంటుంది. అందుకే దాన్ని నీ మనవడికి ఇస్తానని అడగడానికి వచ్చాను" అంది.

వేసుకున్న చిలకలు గొంతుకి అడ్డం పడిన భావన. ఏమంటాడు మరిదిగారు. ఆ రోజు బుధవారం. రామారావ్‌కి వీక్లీ ఆఫ్. తనగదిలో కుర్చుని కాగితాలేవో చూసుకుంటున్నాడు. అప్పుడే తాతయ్య నుండి పిలుపు.

"వస్తున్నా తాతయ్యా" అంటూ వచ్చి "ఏంటి తాతయ్యా? " అనడిగాడు.

"అలా కుర్చీలో కూర్చో.. నీతో మాట్లాడాలి"

కూర్చున్నాడు. "చెప్పు తాతయ్యా?"

"మా అన్నయ్య కూతురు రమ. ఆమె కూతురు మేఘ ఆమెని నీకిచ్చి పెళ్ళిచేయాలని పెళ్ళిమాటలకి వచ్చింది మా వదిన."

"అలాగా? ఐతే నువ్వేమన్నావ్?"

"ఏమంటాను? పోయిన అన్నయ్య ఎలాగూ పోయాడు. ఉన్న బంధం కలుపుకోవాలనుకుంటాను."

"నాకిష్టం లేదంటే?"

"అలా ఎలాగంటావ్? పెద్దవాణ్ణి. నీ బాగోగులు చూడాల్సిన వాణ్ణి నా మాటెలా కాదంటావ్?"

"అంటే" రామారావు రెట్టించాడు.

"అంటే?" ఏముంది? ఈ ఇంట్లో నువ్వో నేనో తేలిపోవాలి"

"విషయం కాస్తా బెడిసి కొడుతున్నట్టు అనిపించి కంగారుగా అంది సుబ్బాయమ్మ. "అయ్యో..అదేంటబ్బాయ్ ఇంత చిన్న విషయానికి అంత పెద్దమాటలంటావ్?" అడ్డుతగిలింది.

"నువ్వుండొదినా ఈ రోజు వీడో, నేనో తేల్చుకుంటాను. చిన్ననాటినుండీ ఏదో విషయంలో నాతో గొడవే. చూడు. మనవడివైతే తరువాత. ముందిది తేల్చు. మా వదిన మనవరాల్ని చేసుకోవాలనుంది. అమ్మాయి అందంగా ఉంటుంది. ఏం వదినా?"

"ఔనయ్యా చాలా బాగుంటుంది"

"పనిమంతురాలు. ఏం వదినా?"

"పనా? అది నాకే పనులు నేర్పుతుంది"

"కమ్మని వంటలు చేయగలదు.. ఏం వదినా?"

"ఔను. అదేదో హోటళ్ళ వంటి ట్రైనింగు కూడా తీసుకుంది"

"చదువుకుంది కూడాను. ఏం వదినా?"

"ఎం.సి.ఏ చేసిందయ్యా?"

"కాస్తో కూస్తో కట్నం కూడా ఇస్తారు. ఏం వదినా?"

"పది లక్షల నగదు, పాతికెకరాల మాగాణి, రెండెకరాల కొబ్బరితోటా ఇస్తాను."

"తాతయ్యా ఇంత మంచి అమ్మయికి నేనెందుకు? ఏ ఐ.ఏయస్ ఆఫీసరో వస్తాడు. నాలాంటి బికారిని చేసుకుని ఏం సుఖపడుతుంది"

"మాకు నువ్వేకావాలి. చేసుకుంటావా? లేదా"

"చేసుకోను"

"మరోసారి ఆలోచించు"

"అక్కర్లేదు. నాకు మొదటి ఆలోచనే చివరి ఆలోచన"

"సరే నా మాట చెల్లని ఇంట్లో నేనుండడం దేనికి? నాదారేదోనే చూసుకుంటాను"

"ఆగు తాతయ్యా ఈ ఇల్లు నీది. ఇక్కడి ప్రతి ఇటుకా నీ కష్టంతో కట్టినదే నిన్ను వెళ్ళగొట్టానన్న అప్రతిష్ట నాకెందుకు? నేనే వెళ్ళిపోతాను` అంటూ గబగబా వెళ్ళి సూట్ కేసు సర్దుకుని వచ్చాడు. జయ, సుబ్బాయమ్మ ఎంతగా బ్రతిమాలినా వినకుండా బైటికి నడుస్తూ "వెళుతున్నా తాతయ్యా" అన్నాడు.

"నేను నిన్ను వెళ్ళిపొమ్మనడంలేదు" కోపంగా అన్నారు తాతగారు.

"ఉంటే నీ మాట వినాలి. అంతకన్నా వెళ్ళడమే మంచిది" విసవిసా బైటికి నడిచాడు రామారావు. పరిస్థితి చేయి దాటిందని గమనించిన సుబ్బాయమ్మ నిజంగానే బాధపడింది. పేరు పేరునా క్షమించమని అడిగి ఆ రాత్రే బండి ఎక్కింది. ఆ రాత్రే సూర్యంతో అంది జయ "మామయ్య తొందరపడ్డారు" అని.

"ఆయనలా తొందరపడరు. ఎందుకలా చేశారో తెలీదు" అన్నాడు సూర్యం.

"ఉదయం అనగా వెళ్ళిన పిల్లాడు ఇంతవరకు ఇంటికి రాలేదు. అసలు వస్తాడో? రాడో"

"తప్పు తెలుసుకుని వాడే వస్తాడు"

"రాడు.. వాణ్ణి విడిచి నేనుండలేను."

పుస్తకాల షెల్ఫ్‌లో ఎదో వెదుకుతున్న సూర్యం అడిగాడు. "జయా వాడికి ఎన్నేళ్ళు?" అని.

"ఇరవై రెండు" అంది.

"నాకెన్నేళ్ళు?"

భర్త ప్రశ్న అర్థంకాకపోయినా జవాబిచ్చింది. "నలభై ఐదు"

అంతే చేతిలోని వస్తువుని గూట్లోకి గిరాటేసి వచ్చి జయ గడ్డాన్ని కుడిచేత్తో పట్టుకుని కోపంగా అన్నాడు. "చూడు వాడితో నీ బంధం ఇరవై ఏళ్ళది. నాన్నతో నా అనుబంధం నలభై ఏళ్ళది. వాణ్ణి విడిచి నువ్వే ఉండలేనన్నావు. నాన్నని విడిచి నేనెలా ఉండగలను? నీ కొడుకు నీ ఇంట్లో నుండి వెళ్ళి మంచిపనిచేశాడు. మా నాన్నే వెళ్ళి ఉంటే మిమ్మల్నిద్దర్నీ కట్టగట్టి బైటికి విసిరేసేవాడిని" అంటూ చేతిని విసురుగా విడిచి బైటికి వెళ్ళిపోయాడు.

భర్తలో అంత కోపాన్ని చూడని జయ భయపడిపోయింది. తరువాత నాలుగు రోజులకి పాలు పోసే కుమార్ అన్నాడు. "అమ్మా మీ అబ్బాయిగారు వరంగల్‌లో ఉన్నారు. `ఏంటి బాబూ ఇంటికి రారా` అంటే నవ్వుతూ `రాను` అన్నారు" అని చెప్పాడు.

భర్తకి భయపడి అతనితో చెప్పలేక నిద్రాహారాలు మాని దిగులుగా కూర్చుంది జయ.

తరువాత రెండో రోజు వచ్చాడు రామారావు. తాతగారు ఎటో వెళ్ళారు. సూర్యం ఆఫీసుకి వెళ్ళాడు. సూట్ కేసు క్రింద పెడుతూనే "ఏంటమ్మా అలా ఉన్నావ్?" అడిగాడు రామారావు.

"ఏరా మామీద కోపం పోయిందా?" అంది జయ కోపంగా.

"మీ మీద కోపమేమిటమ్మా?" చిరునవ్వుతో అడిగాడు.

"అందుకేగా ఇల్లు వదిలి వెళ్ళావ్?" అడిగింది.

"ఓ తాతయ్యతో పోట్లాడి వెళ్ళాననా? అదంతా సుబ్బాయమ్మగారిని వెనక్కి పంపడానికి తాతయ్యా, నేనూ ఆడిన నాటకం. నేను కాంప్‌కి వెళ్ళనున్నట్టు తాతయ్యకి ముందే తెలుసు. 'నువ్వో నేనో తేలాలి' అని తాతయ్య అనగానే నన్ను వెళ్ళమంటున్నాడని గ్రహించి ఓ పూట ముందుగానే వెళ్ళిపోయాను. ఈ విషయం సుబ్బాయమ్మగారు వెళ్ళిపోగానే నీతో చెప్పి ఉండాలే"

"లేదురా నిన్ను వెళ్ళగొట్టారని కోపంతో నేను తాతయ్యతో పల్కడం మానేశాను. అంతేకాదు. ఎన్నడూ లేని విధంగా మీ నాన్న కోపానికి గురయ్యాను" అంటూ జరిగింది చెప్పింది.

"తాతయ్యని అనుమానించి తప్పుచేశావమ్మా" అంతే అన్నాడు. పశ్చాత్తాపంతో కూలబడిపోయింది జయ. రామారావ్ తన గదిలోకి వెళ్ళాడు. మనస్సంతా గజిబిజిగా ఉంది.

"తాతయ్యని తండ్రిలా చూసిన తల్లి ఆయన్ని ఎందుకు అనుమానించింది? మనుషుల మధ్యనున్న బంధాన్ని కడదాకా కట్టిపడేసే సూత్రం ఏంటి? ప్రేమ, అనురాగం? ఆప్యాయత? ధనం? నమ్మకం? ఏది? ఏది?' అలా ఆలోచిస్తూ ఎంతసేపు గడిపాడో తెలీదు. హాల్లో నుండి మాటలు వినిపించాయి.

"క్షమించాల్సిన తప్పు నీదేమీ లేదమ్మా. మా వదిన ఘటికురాలు. ఇక్కడ సి.ఐ.డిల వంటి వారిని ఉంచి వెళ్ళింది. నిన్నరాత్రి వాళ్ళూ వెళ్ళిపోయారు. ఈరోజు పనుండి అలా వెళ్ళాను. రాగానే చెబుదామనుకున్నాను. ఈలోగా మనవాడే వచ్చాడు" అన్నాడు.

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు రామారావు.

●●●

ఇంటిముందున్న చిన్న తోటలో జయ, సూర్యం, తాతగారు కుర్చీల్లో కూర్చున్నారు. తోట పెంపకం, సంరక్షణ అంతా తాతగారి పనే. ఉన్న చిన్న స్థలాన్ని అందమైన తోటగా మార్చింది ఆయనే. తీరిక దొరికినప్పుడల్లా ఆయన చేసేవి రెండే పనులు. ఒకటి భాగవతం చదవడం, రెండు మొక్కలకి సేవచేయడం.

సాయం వేళ ఇంట్లోని నలుగురూ అక్కడ కూర్చుంటారు. కాఫీ తాగుతూ లేదా చిరుతిండి తింటూనో గడుపుతారు. 'తొలిసంధ్య'లో చేరాక రామారావు ఆలస్యంగానే వస్తున్నాడు. మిగిలిన ముగ్గురూ ఆ సమయాన్ని అలాగే గడుపుతున్నారు.

దినపత్రికతో సూర్యం, వారపత్రికతో జయ, భాగవతంతో తాతగారూ అక్కడే కూర్చుని ఉన్నారు. అంతలో గేటు శబ్దం. ఇద్దరు మగపిల్లలు గేటు తీసుకుని లోపలికి వచ్చారు. పెద్దపిల్లాడి వయస్సు ఇరవైఏళ్ళకి పైనా, చిన్నవాడు పన్నెండేళ్ళలోపు ఉన్నారు. పోలికలు ఇద్దరివీ ఒకరకంగా ఉన్నాయి. ఇద్దరూ గోధుమ రంగు లాల్చీ, పైజమా ధరించి ఉన్నారు.

వీళ్ళున్న చోటుకి వచ్చి "ఆంటీ, అంకుల్, తాతయ్యా నమస్తే" అన్నాడు పెద్దవాడు. తరువాత చిన్నవాడు కూడా నమస్కరించాడు "మీరు"? అంది జయ. "మీ ఎదురింట్లో ఉంటామాంటీ" అన్నాడతను.

"ఓ కొత్తగా అద్దెకి వచ్చారా?"

"లేదాంటీ అద్దెకున్నవాళ్ళని ఖాళీచేయించి, మా ఇంట్లోకి మేం వచ్చేశాం"

"అలాగా కూర్చోండి బాబూ మీ పేరు?"

"నా పేరు సిరియాళ్. వీడు నా తమ్ముడు. పేరు అంబరీష్"

"పేర్లు బాగున్నాయి. మీరే కదూ ఉత్తర భారతదేశంలో ఉంటున్నారని విన్నాను."

"అవునాంటి మా నాన్నగారు పోయాక ఆ ఉద్యోగం అమ్మకు ఇచ్చారు. ఇప్పుడు అమ్మ కూడా వాలెంట్రీ రిటైర్మెంటు తీసుకుంది. అందుకని మా ఇంటికి మేం వచ్చేశాం"

"కూర్చోండి బాబూ కాస్త నిమ్మరసం తెస్తాను"

"వెళ్తాం ఆంటీ. మీతో కాస్త పనుండి వచ్చాం."

"ఏం పని బాబూ. అడుగు."

"కరివేపాకు కారం ఎలా చేస్తారో తెలుసుకుందామని"

"అలాగా" అంటూ చెప్పింది కరివేపాకు కారం తయారీ గురించి. "థాంక్స్ ఆంటీ ఇంక వెళ్ళొస్తాం" అంటూ వెళ్ళబోయిన వాడల్లా ఆగిపోయి "ఆంటీ మేం అప్పుడప్పుడు మీ ఇంటికి రావచ్చా అఁహఁ ఏంలేదు. మేం ఇన్నిరోజులు వేరే రాష్ట్రంలో ఉన్నాం. ఇక్కడి కూరలు, వంటలు మాకు కొత్త. అప్పుడప్పుడు వచ్చి నాకు డౌటనిపించిన వంటకం గురించి నేర్చుకోవాలని.."

"మంచివాడవే. ఈ మాత్రం దానికి సందేహిస్తావెందుకు? అప్పుడప్పుడు కాదు. ప్రతీ రోజూ రా బాబు. మీ అమ్మగారిని కూడా తీసుకునిరా.

"అలాగేనాంటీ థాంక్స్" వెనుతిరగబోయిన అతను ఆగిపోయాడు.

"సిరియాళ్‌జీ" అనే తమ్ముడి పిలుపుతో "జీ" అన్న జవాబు "మంచివాడంటే?" తమ్ముడి ప్రశ్న. "మంచివాడంటే ఏం లేదు. మనస్సులో దాగున్న కుళ్ళుని ఇతరులకు కనిపించకుండా ప్రవర్తించే వాడు" తమ్ముడికి చెప్పి "సారీ ఆంటీ మా తమ్ముడు ఇప్పుడిప్పుడే తెలుగు నేర్చుకుంటున్నాడు. వాడికి తెలీని పదాలు వినబడితే అలా అర్థం అడుగుతుంటాడు" అని జయతో చెప్పాడు.

"అప్పుడు నువ్వు అర్థాలకి బదులు ఇలా విపరీతార్థాలు చెబుతావన్నమాట"

జయ మాటలకి సిరియాళ్ చిన్నగా నవ్వి తమ్ముడిని తీసుకుని వెళ్ళిపోయాడు.

మర్నాడు రాత్రి భోజనాలు చేస్తుండగా వచ్చాడు "ఆంటీ గోంగూరపులుసు ఎలా చేయాలి?" అంటూ కాస్సేపుండి "మార్కెట్‌కి వెళ్ళొచ్చేసరికి ఆలస్యమయింది" అన్నాడు.

"గోంగూర పులుసు రేపు చేసుకోవచ్చుగానీ కూరా, పులుసూ, పచ్చడీ ఉన్నాయి. నే పెట్టిస్తాను నీకు అభ్యంతరం లేకుంటే తీసుకు వెళ్ళు" అంది.

"అదీ.. అమ్మ..!?" అతను నసిగాడు.

"మీ అమ్మగారు ఏమైనా అంటే ఆంటీ బలవంతంగా ఇచ్చారని చెప్పు. సరేనా?" అంటూ చిన్న చిన్న బాక్సులతో వచ్చింది" కరివేపాకు కారం కూడా ఉందిందులో" అంది.

"ఆఁ అన్నట్టు ఇందాక ఆంజనేయస్వామికోసం చేసిన చిట్టిగారెలున్నాయి. దేవుడి ప్రసాదం. అంటూ మరో బుల్లి డబ్బా కూడా తెచ్చిచ్చింది.

"సిరియాళ్ జీ"

"జీ"

"దేవుడంటే?"

"దేవుడంటే ఏంలేదు. మానవుడు చేయబోయే మంచిపనులకి ధైర్యాన్ని, చెడుపనులకి అధైర్యాన్ని కలిగింప చేసే గొప్ప ఆలోచనాతరంగమే దేవుడు."

"బాగుందబ్బాయ్ చక్కగా చెప్పావ్" అంది జయ. అలా ప్రతిరోజు ఏదో ఒక సమయంలో వచ్చేవారు. వయస్సులో తారతమ్యాలున్నా అన్నాతమ్ముళిద్దరూ విడిగా ఎప్పుడూ కనిపించలేదు. ఆ రోజు అర్ధరాత్రి ఎవరో తలుపులు బాదితే రామారావు వెళ్ళి తలుపుతీశాడు. ఈలోగా జయ, సూర్యం, తాతగారూ వచ్చారు. గుమ్మం అవతల ఓ స్త్రీ నిల్చుని ఉంది.

"ఎవరు మీరు?" అడిగాడు రామారావు. ఆ ప్రశ్నని వినిపించుకోకుండా "బాబూ మా సిరియాళ్‌ని చూశారా? వాడిక్కడికి వచ్చాడా?" అనడిగింది. "లేదండీ రెండురోజులుగా అతను మా ఇంటికి రావడంలేదు" అంది జయ. ఆమె నిలవడానికి ఓపిక చాలనట్టు గోడని పట్టుకుని క్రింద కూర్చుంది.

"అవును. వాడు రాడు. వాణ్ణి నానా మాటలూ అన్నాను. అంటూ దుఃఖించసాగింది. జయ గబగబ ఆమె దగ్గరకి వెళ్ళి "ఏంటలా క్రింద కూర్చున్నారు? ఒంట్లో బాలేదా? లేదండి. రండిలా" అంటూ బలవంతాన ఆమెని లేపి ఇంట్లోకి తీసుకు వచ్చి కుర్చీలో కూర్చోబెట్టింది. అప్పుడు పరీక్షగా చూశారంతా. ఆమె చాలాకాలం నుండి అనారోగ్యంతో ఉన్న మనిషిలా ఉంది "నాకేదో గుండెజబ్బట. ఆపరేషన్‌కి డబ్బుకోసం ఇల్లు అమ్ముతానన్నాడు. నేను వద్దని తిట్టాను. ఒకటి కొట్టానుకూడా." ఆమె ఆగింది ఓ క్షణం.

ఆయాసం తీర్చుకుని తిరిగి అన్నది "మరేం చేయను? వాడి మాటని కాదనలేక బంగారం, వెండి తాకట్టు పెట్టాను. బ్యాంక్‌లో డబ్బంతా నా జబ్బుకి పెట్టాను. చివరకు పదిరోజుల క్రితం మా అక్కయ్య పట్టుచీర.. పదివేల రూపాయల చీర వెయ్యిరూపాయలకి అమ్మి, మందులు తెస్తే కాదనలేదు. ఇప్పుడేమో ఇల్లు అమ్మి నాకు ఆపరేషన్ చేయిస్తానని కూర్చున్నాడు. వద్దన్నాను. తిట్టిపోశాను. వాడి ఎక్కడికో వెళ్ళాడు."

"మీ అక్కయ్యగారు ఎవరు?"

"మా అక్కయ్య సిరియాళ్ వాళ్ళమ్మగారు. అంబరీష్ నా కొడుకు. మీ కాళ్ళుపట్టుకుంటాను. వాడు ఏం చేసినా కాదనను. దయచేసి వాణ్ణి వెదికి పెట్టండి. వాణ్ణి చూడకుండా నేనుండలేను. దయచేసి నా బాబుని వెదికిపెట్టండి" అంది కన్నీళ్ళతో.

"బాబోయ్. ఈవిడకి జ్వరంగా ఉంది" అంది జయ. రామారావ్ వెంటనే స్కూటర్ మీద బయటికి వెళ్ళాడు. ఆటో తెచ్చాడు. అప్పటికి ఆమె నీరసంతో కళ్ళుమూసుకుని ఉంది. ఆమెని హాస్పిటల్లో చేర్చారు. రెండురోజుల్లో ఆపరేషన్ చేయాలన్నారు డాక్టర్లు.

తాతగారి మిత్రుడొకాయనకి పరిస్థితి వివరిస్తే "నేను ఆర్థికంగా సాయం చేయలేను. కాని పేదవారికి ప్రభుత్వం ఇచ్చే సహాయం ద్వారా ఆపరేషన్ ఖర్చు లేకుండా చేయగలను" అన్నారు.

"అదే మహద్భాగ్యం" అన్నారు తాతగారు.

మొత్తం మీద సిరియాళ్ వాళ్ళమ్మకి ఆపరేషన్ విజయవంతమైంది. మందులకూ, మిగిలిన ఖర్చులకీ రామారావ్ వాళ్ళు సాయం చేశారు. ఆమె పేరు లత.

తల్లి ఇంటికి వచ్చాక సిరియాళ్ అన్నాడు "రామారావ్ భయ్యా ఏం చేసి మీ ఋణం తీర్చుకోను?" అని.

"మాకేమీ చెయ్యద్దు. మీ అమ్మగారిని బాగా చూసుకో చాలు" రామారావ్ అన్నాడు.

"చూసుకుంటాను భయ్యా. నాకు బొమ్మలు వేయడం తప్ప మరో పనిరాదు. ఒకాయన్ని కలిశాను. సినిమా వాల్ పోస్టర్లు వేయమన్నారు. ఎల్లుడినుండి రమ్మన్నారు."

"నువ్వు బొమ్మలు వేస్తావా? కార్టూన్లు వేయగలవా?"

"వేస్తాను భయ్యా. అక్కడి లోకల్ పత్రికల్లో కొన్ని అచ్చయ్యేవి కూడా"

"ఎక్కడ?"

"మహారాష్ట్రలో. నాకూ తమ్ముడికీ చిరుతిళ్ళ ప్యాకెట్ మనీ నేనే సంపాదించుకునేవాడిని. అమ్మని ఇబ్బంది పెట్టడం ఇష్టంలేకపోయింది"

"గుడ్ 'తొలిసంధ్య'లో కార్టూనిస్ట్ కోసం చూస్తున్నారు. మంచి కాన్సెప్ట్‌తో కొన్ని కొత్తవి వేసుకుని పాతవాటిల్లో నీకు నచ్చినవి తీసుకునిరా. ఎల్లుండి ఇంటర్వ్యూ ఉంది"

"సరే భయ్యా"

"కాని ఒక్క విషయం విను. నేను నిన్నక్కడ పరిచయం చేస్తాను. రికమెండేషన్ చేయను. నీలు ప్రతిభ ఉంటేనే ఉద్యోగం వస్తుంది. లేదంటే అవకాశం పోతుంది. ఉద్యోగానికి నన్ను నమ్ముకుని రావద్దు. నిన్ను, నీ కళని, శక్తిని నమ్ముకునిరా. అవి నీలో లేవనుకుంటే రాబోకు"

"సరే భయ్యా"

"అసలిలా పరిచయం చేయడం కూడా నా స్వభావానికి వ్యతిరేకం. కానీ మీ కుటుంబ పరిస్థితిని చూసి నీకీ సాయం చేయదల్చుకున్నాను."

"భయ్యా.. నా చేతయినంత ప్రయిత్నిస్తాను. తరువాత దేవుని దయ"

"అవును సిరియాళ్ ఆ రోజు అమ్మగారి మీద అలిగావుట. ఎందుకు?"

"అమ్మ మీద ఎవరైనా అలుగుతారా భయ్యా? ఇల్లు అమ్మకూడదదంది. అందుకే అప్పుకోసం ఊరంతా తిరుగుతూ కూర్చున్నాను. అదీ మంచిదే అయింది. ఆమెకి ప్రాణగండం పోయింది మీవల్ల."

"ముందు ఆ పొగడ్తలు ఆపు. కాగల కార్యం చూడు" అన్నాడు రామారావ్.

"సరే భయ్యా నాకల్లో ఉన్న కార్టూన్లన్నీ కళ్ళముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తాను" అన్నాడు సిరియాళ్.

●●●

"రామారావ్ నువ్వో కార్టూనిస్ట్‌ని తెచ్చావంటే పర్లేదు కాస్తో కూస్తో ప్రతిభ ఉంటుందనుకున్నాను. కానీ అతను ప్రతిభతోనే పుట్టాడని తెలుసుకున్నాను" సిరియాళ్‌ని అపాయింట్ చేస్తూ రామారావుతో అన్నాడు చంద్రశేఖర్. అంతే ఆనాడే 'తొలిసంధ్యలో 'సిరి ఆలం' అనే రాజకీయ కార్టూన్ ప్రత్యక్షమయింది.

'తనమీద తాను వేసుకున్న గ్రేట్‌జోక్' అన్న నానుడి ప్రకారం తనదే తన కార్టూన్‌కి ఎన్నుకున్నాడు సిరియాళ్.

ఎత్తునుదురు, గొప్పచెవులు, మిడిగుడ్లు లావు పెదవులు, కుంచించుకుపోయిన మెడ, బానపొట్ట సన్నని చేతులు. ఇదీ ఆ రాజకీయనాయకుడి అవతారం. ఆయన పేరు ఆలం. ఆవుదూడల లంకయ్య. ఆయన పి.వి.సిరి. వెరసి సిరిఆలం. ఆలం చెప్పే రాజకీయ సూత్రాలు విని సిరికి తరచూ తలవాచి పోతూ ఉంటుంది. ఒక్కోసారి కళ్ళు తిరిగి క్రింద పడిపోతూ ఉంటుంది.

క్రిందపడిన వ్యక్తి తనంతట తానే లేవాలి. మరొకరు లేవనెత్తరాదు. ఇది రాజకీయ పునరుక్తి అంటాడు ఆలం. రాజకీయ వింతలు, వివరాలు, విశేషాలు తెలుపుతుంటాడు. తరచుగా పాతాలు, అరుదుగా సూక్తులు చెబుతుంటాడు. ఎనిమిది వంకరలు కలిగిన 'ఆలం'లో సిరియాళ్ పోలికలు కనబడ్డం కొసమెరుపు.

ఆనాటి నుండి 'తొలిసంధ్య' పాఠకుల కళ్ళు 'సిరిఆలం' కోసం వెదకడం మొదలెట్టాయి. మరో దినపత్రికలో 'సిరిఆలం' ఉండదని ఈ పత్రికని వేసుకునే పాఠకులు తయారయ్యారు. పాఠకుల స్థాయిని రామారావూ, పత్రిక స్థాయిని సిరియాళ్ పెంచేశారు.

సిరియాళ్ తమ్ముడు అంబరీష్‌ని స్కూల్లో చేర్చాడు. తాకట్టులో ఉన్ననగలు, వెండి తెచ్చేసుకున్నాడు. ఇల్లు రిపేర్ చేయించాడు. ఫర్నీచర్ కొన్నాడు. "రెండేళ్ళ వరకూ మీ అమ్మగారికి రెస్ట్ అవసరం. ఆవిడ బలహీనంగా ఉన్నారు" అన్నాడు డాక్టరు. అందుకోసం ఓ పనమ్మాయిని ఏర్పాటు చేశాడు. ఉదయమంతా ఆమె చూసుకునేది లతని. సాయంత్రం అన్నదమ్ములు చూసుకునేవారు. ఆఫీసు నుండి రాగానే అందరూ రామారావు వాళ్ళ చిన్నతోటలో చేరేవాళ్ళు.

ఆ రోజు రాత్రి ఎనిమిదయింది. ఇంకా ఏదో విషయం మీద వాడివేడి చర్చ జరుగుతోంది. చాలాసేపు వాళ్ళవంక చూసిన అంబరీష్‌కి బోర్ కొట్టింది. "సిరియాళ్‌జీ" అన్నాడు. "జీ" అన్నగారి జవాబు.

"ఆకలి అంటే?" అడిగాడు వెంటనే. "ఆకలి అంటే ఏం లేదు బ్రతికున్న వాడి పొట్టలో నిప్పులేని మంట" సిరియాళ్ జవాబు చెప్పి మళ్ళీ చర్చలో పాల్గొనబోయి తమ్ముడి వంక చూశాడు.

"సిరియాళ్ జీ ప్రస్తుతం నా పొట్టలో అదే" అన్నాడు. సిరియాళ్ వెంటనే తమ్ముణ్ణి దగ్గరకి తీసుకుని "పదినిమిషాల్లో భోజనం పెడతా" అంటూ లేచాడు.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments